క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నందిగామ: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదోతరగతి వరకు చదివి ఆరోతరగతిలో అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గుత్తా ప్రదీప్ తెలిపారు.విద్యార్థులను మరింత ప్రోత్సహించి చదువులో మరింత ఆసక్తి కలిగేలా చేసేందుకే గ్రాడ్యుయేషన్ డే ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం



నందిగామ: నాణ్యతా ప్రమాణాలతో కూడిన మెరుగైన విద్య అందించడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదోతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించగలిగారని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కస్తాల జయదీప్ పదోతరగతి పరీక్షల్లో 600మార్కులకుగాను 578 మార్కులు సాధించడంపై హర్షం వ్యక్తంచేస్తూ జయదీప్‌ను ఆయన మంగళవారం ఘనంగా సత్కరించారు. రవిశంకర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మనరాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. అందుకు ఈఏడాది పదోతరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులే నిదర్శనమని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి,వైఎస్సార్సీపీ నాయకుడు దేవినేని రామారావు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరావాలని వినతి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు వేముల మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ బీసీ విభాగం పేట పట్టణ, మండలం అధ్యక్షులు గుంజ లక్ష్మణ్, చాపల వెంకటేశ్వర్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల అధ్యక్షులు రాగం కోటయ్య, బత్తుల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయభాను నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

407 మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట: ఏపీకి అక్రమంగా తరలిస్తున్న 407 మద్యం సీసాలను ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబి సిఐ మణికంఠరెడ్డి కథనం మేరకు తెల్లవారుజామున 3గంటల సమయంలో తెలంగాణా రాష్ట్రం దొండపాడు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఈబీ పోలీసులు జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాల ద్వారా మద్యం 407 మద్యం సీసాలు తీసుకువస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.1.31లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వ్యక్తి అదృశ్యం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ కాలువ కట్టపై జక్కంపూడి వరలక్ష్మి కుటుంబ సభ్యులతో నివశిస్తుంది. ఆమెకు ముగ్గురు పిల్లలు. గత నెలలో ఆమె కుమారుడు జక్కంపూడి నాగరాజు ఇంటి ముందు ఉంటున్న లాల్‌బీ బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టమంటే పెట్టి సొమ్ము తీసుకువచ్చి లాల్‌బీకి ఇచ్చాడు. ఈ విషయంలో వివాదం వచ్చి లాల్‌బీ నాగరాజుపై కేసు పెట్టింది. గొడవ తర్వాత నాగరాజు ఇంటి నుంచి వెళ్లి పోయాడు. సోమవారం నాగరాజు తన వాట్సాప్ నుంచి సోదరికి మెసేజ్ పెట్టాడు. తాను చనిపోతున్నానని, తన బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజీ వద్ద ఉంచానని తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రకాశం బ్యారేజ్ వద్దకు వెళ్లి చూడగా బైక్, ఫోన్, లెటర్ దొరికింది. అయితే నాగరాజు మాత్రం కనిపించలేదు. దీంతో తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్

- సమరోత్సాహంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు
- అట్టహాసంగా ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ అభ్యర్థిగా సామినేని ఉదయభాను బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భారీసంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరానుండటంతో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ల దాఖలు కార్యక్రమ ఏర్పాట్ల నేపథ్యంలో జగ్గయ్యపేటలో సందడి నెలకొంది. నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థితోపాటు కేశినేని శ్రీనివాస్(నాని)తోపాటు ఆపార్టీ ప్రముఖులు హాజరు కానున్నారు.

జగ్గయ్యపేట నుంచి ఆరోసారి బరిలోకి..

జగ్గయ్యపేట నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆరోసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు విజయకేతనం ఎగురవేసిన సామినేని ఉదయభాను నాలుగోసారి ఎమ్మెల్యేగా జైత్రయాత్ర కొనసాగించేందుకు సన్నద్ధమవుతున్నారు. నిగర్వి, అభివృద్ధి ప్రదాతగా, నిత్యం ప్రజల మధ్యన ఉండే నాయకుడిగా పేరు తెచ్చుకున్న సామినేని ఉదయభాను వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనుండటంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి.

ఉదయభాను రాజకీయ ప్రస్థానం..

సామినేని ఉదయభాను విద్యార్థి దశలో జగ్గయ్యపేట ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షులుగా పనిచేశారు. 1981లో కృష్ణాజిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించి, జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 1998లో పీసీసీ కార్యదర్శిగా ఎంపికై 1999, 2004 ఎన్నికల్లో వరుసగా జగ్గయ్యపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జగ్గయ్యపేట నియోజకవర్గానికి రూ.450 కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. 2009,14లో ఓడినప్పటికీ నిత్యం ప్రజల్లో ఉంటూ తిరిగి 2019లో వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. రూ.560కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు రూ.1245కోట్ల మేర లబ్ధి చేకూరేలా పని చేశారు. జగ్గయ్యపేటలో ఓసారి ఓడిన అభ్యర్థి తిరిగి పోటీచేసినా గెలిచిన దాఖలాలు లేవు. 2019లో గెలుపొందడం ద్వారా ఉదయభాను ఆ చరిత్రను తిరగరాశారనే చెప్పవచ్చు.

పాదయాత్రగా బయలుదేరి..

జగ్గయ్యపేట అర్బన్: ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నామినేషన్ సందర్భంగా బుధవారం తన గృహం నుంచి పాదయాత్రగా బయలుదేరుతారు. ఈ యాత్ర ముక్త్యాల సెంటర్, బంగారు కొట్ల సెంటర్, బలుసుపాడు సెంటర్, రాజీవ్ చౌక్, కోదాడ రోడ్, డాక్టర్స్ రోడ్, సీతారామపురం, కమలా సెంటర్ మీదుగా ప్రధాన రహదారుల గుండా పాత మున్సిపల్ కార్యాలయం సెంటర్ వరకు కొనసాగుతుందని ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు. అనంతరం అదే సెంటర్‌లో సభ జరుగుతుందని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, రైతులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఉదయభాను కోరారు.

జగన్‌మోహనరావు నామినేషన్‌కు హాజరుకండి



నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎద్దుల బండిపై జగన్‌మోహనరావు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కోరారు.

నామినేషన్ రూట్ మ్యాప్ ఇలా..

డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నామినేషన్ కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అరుణకుమార్ తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి సీఎం రోడ్డు, రైతుపేట, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, మెయిన్ బజార్, రథం సెంటర్, మయూరి రోడ్డు, భారత్ టాకీస్ సెంటర్, గాంధీ సెంటర్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు జగన్‌మోహనరావు నామినేషన్ దాఖలు చేస్తారని వివరించారు. ఎమ్మెల్సీ వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉదయభాను

భీమవరం(వత్సవాయి) : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాపగంటి బాబురావుతోపాటు మరో పదిమంది టీడీపీని వీడి మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోచేరారు. వీరికి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. అర్హత కలిగిన ప్రతి వారికి ఎటువంటి సిఫారసులు లేకుండా నేరుగా పథకాలు అందుతుండటం చూసి ముఖ్యమంత్రికి మద్దతుగా నిలవాలనే ఉద్దేశంతోనే టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు తెలిపారు. గ్రామపార్టీ నాయకులు గుండం రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక మిట్టగూడెంకు చెందిన వల్లాపురం శివ, సైదా తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధిని సాధిస్తోందన్నారు. జగనన్న పాలనకు ఆకర్షితులై పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. జగ్గయ్యపేటలో సామినేని ఉదయభాను విజయానికి కృషిచేయాలని వారికి సూచించారు. స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుపుకోరుతూ ఆయన సోదరీమణులు జయశ్రీ, చాముండేశ్వరి(బేబి), ఆయన కుమార్తె పద్మప్రియాంక పట్టణంలో 19వవార్డులో మంగళవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ప్రచురించిన బ్రోచర్‌లను ఓటర్లకు పంపిణీ చేశారు. పట్టణంలో ఉదయభాను చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆయనను మరోసారి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

జగన్‌మోహనరావు విజయం కోరుతూ..

కంచికచర్ల : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి రెండోసారి అధికారం చేపట్టేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలని కొత్తపేట సర్పంచి పత్తిపాటి సునీత కోరారు. నందిగామ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)విజయాన్ని ఆకాంక్షిస్తూ మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు ప్రత్తిపాటి కృష్ణమూర్తి, ముప్పాళ్ల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన పెండ్యాల విద్యార్థులు



వేముల నాగలక్ష్మి (554)



టి.పల్లవి (549)



ఆర్.తేజశ్రీ (543)



ఎన్.అశ్విని (521)



షేక్ షబ్రీన్‌బానో (506)



షేక్ సిరాజ్‌మునీర్ (505)

పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో విజయదుందుభి మోగించారని ప్రధానోపాధ్యాయులు డి.శ్రీను మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఆరుగురు బాలికలు 500కు పైగా మార్కులు సాధించడంతోపాటు వేముల నాగలక్ష్మి అత్యధికంగా 554మార్కులు టి.పల్లవి (549) మండల స్థాయిలో టాపర్లుగా నిలువడం పాఠశాలకే గర్వకారణమని కొనియాడారు. అదేవిధంగా తమ విద్యార్థులు ఎస్.అశ్విని(521), షేక్ షబ్రీన్‌బానో(506), షేక్ సిరాజ్‌మునీర్(505)మార్కులు సాధించినట్లు ఆయన వివరించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్ నైమూన్, వైస్ చైర్మన్ సయ్యద్ షాబుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు



అవినయ్‌ని అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

గంద్రాయి(జగ్గయ్యపేట): మండలంలోని గంద్రాయి మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల నుంచి నవోదయ పాఠశాలకు ఎంపికైన బోయిళ్ల అవినయ్‌ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంఈవో ఎల్.చిట్టిబాబు మాట్లాడుతూ వేసవిసెలవలను వృధా చేయకుండా విద్యార్థులు వారికి నచ్చిన రంగాల్లో శిక్షణ తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం నేలవల్లి రమేష్‌బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, ముక్తేశ్వరరావు, రమాదేవి, జ్యోతి కుమారి, కృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ బండి



గండేపల్లిలో ఎడ్లబండిని సిద్ధం చేస్తున్న సత్యనారాయణ, కోటేశ్వరరావు

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం నందిగామ ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో గండేపల్లికి చెందిన ఆపార్టీ నాయకులు ఓ ఎడ్ల బండిని సిద్ధం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఇదే ఎడ్లబండిపై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఆ ఎన్నికల్లో జగన్‌మోహనరావు ఘనవిజయం సాధించిన నేపథ్యంలో సెంటిమెంటుగా భావించిన ఆపార్టీ నాయకులు ఈ సారి కూడా నామినేషన్ కార్యక్రమానికి ఈ ఎడ్ల బండిని సిద్ధం చేస్తున్నారు. మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన కంఠంనేని కోటేశ్వరరావు ఎడ్లబండిని గ్రామ పార్టీ కన్వీనర్ గడుపూడి సత్యనారాయణ తన సొంత ఖర్చులతో అందంగా ముస్తాబు చేశారు. ఈ ఎడ్లబండిపై ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు నామినేషన్ దాఖలు చేస్తారని సత్యనారాయణ వివరించారు. నందిగామలో బుధవారం నిర్వహించే డాక్టర్ జగన్‌మోహనరావు నామినేషన్ కార్యక్రమంలో ఈ ఎడ్లబండి ప్రత్యేకకార్షణగా నిలువనుంది.

నేత్ర పర్వంగా చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారులకు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: శ్రీసీతారామ కల్యాణం, నూతన సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా సత్యనారాయణపురం గిరి వీధిలోని కళావేదికపై మంగళవారం అభినయ నృత్య వేదిక నిర్వాహకురాలు, నాట్యాచారిణులు వీ కృష్ణగౌతమి, సీహెచ్ ప్రసన్న ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. వినాయక కౌతం, మహాగణపతిం, సిరి నవ్వులనాడే, పలుకే బంగారమాయనా, భోశంభో, భామా కలాపం, తందనానా, బాలకనక మయ, మధుర మీనాక్షి అంశాలను ప్రదర్శించారు. హిమజ, రుచిత, రమ్య, వర్షిణి, మేఘన, ధనప్రియ, ప్రేమసాయి, లోక్షిత, రిషిత, చైతన్య నృత్యాలను ప్రదర్శించారు. వీ సురేష్ పర్యవేక్షించారు. తంగిరాల రాఘవశాస్త్రి చిన్నారులను సత్కరించారు.

వైభవంగా ఎదురుకోలోత్సవం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాంగా రెండోరోజు మంగళవారం సుప్రభాతసేవ, పుష్పాలతో అలంకరణ, నిత్యహోమం, బలిహరణ, ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో ఆయా పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఇన్‌చార్జి ఈవో నూతక్కి సాంబశివరావు ఏర్పాట్లు చేశారు. సీఐ జానకీరామ్, ఎస్ఐ సతీష్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవా సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు.

వలంటీర్లు రాజీనామా

నందిగామ: వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 9 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వారి రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఎం.విశ్వనాథ్‌కు అందజేశారు. తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన ఆరుగురు, కంచల గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఏడు నామినేషన్లు దాఖలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా ఐదోరోజు మంగళవారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా కొడమల ప్రభుదాసు రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయగా, టీడీపీ తరఫున శ్రీరాం శ్రీదేవి పేరుతో ఆ పార్టీకి చెందిన శ్రీరాం రామకృష్ణ రెండోసెట్ నామినేషన్ వేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా చిల్లకల్లుకు చెందిన శ్రీరాం రామకృష్ణ నామినేషన్ వేశారు. పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామానికి చెందిన బేరోతుల ప్రకాశరావు, జగ్గయ్యపేటకు చెందిన కట్టా బుజ్జిబాబు, పెనుగంచిప్రోలు మండలం, నవాబుపేటకు చెందిన జామ ఆనందరావు, చిల్లకల్లు గ్రామానికి చెందిన వేల్పుల విజయ్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.

నందిగామలో..

నందిగామ: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. నందిగామ టీడీపీ అభ్యర్థిగా ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన తంగిరాల సౌమ్య, మంగళవారం రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. టీడీపీ నాయకులతో కలసి వెళ్లి రెండో సెట్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీంద్రరావుకు అందజేశారు.

ప్రతిభ చూపిన హాస్టల్ విద్యార్థులు



జగ్గయ్యపేట అర్బన్: పదోతరగతి ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ విద్యార్థి యామర్తి కృష్ణాంజలి, ఎస్సీ హాస్టల్ విద్యార్థి శీలం శ్రీరాం అత్యుత్తమ మార్కులు సాధించడంపై సోషల్ వెల్ఫేర్ అధికారులు హర్షం వ్యక్తంచేస్తూ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీఎస్ఎస్ గణేష్‌బాబు మాట్లాడుతూ పేట పట్టణంలోని ప్రభుత్వ ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్‌లో ఉంటూ, ప్రక్కనే ఉన్న బాలుర హైస్కూల్‌లో చదువుతున్న కృష్ణాంజలి 551మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవడం, ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ విద్యార్థి శీలం శ్రీరాం 501 మార్కులు సాధించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నస్రీన్ సుల్తానా మాట్లాడుతూ తమ హాస్టల్‌లో 20 మంది బాలికలు పదోతరగతి పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని వివరించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఆంజనేయులు, ఎం. వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రారంభమైన జగద్గురువుల జయంతి ఉత్సవాలు



విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో 20 రోజులపాటు నిర్వహించే ఆదిశంకరుల జయంతి ఉత్సవాలు దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవాలయ రుత్వికులు ఉదయం ఆదిశంకరులకు పంచామృత అభిషేకం, అర్చన, అష్టోతర శత నామావళి కార్యక్రమాన్ని వేదోక్తంగా నిర్వహించారు. దేవాలయ ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, సభ్యుడు గండూరి చంద్రమౌళి పాల్గొన్నారు. ఆధ్యాత్మికవేత్త శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఆదిశంకరుల విరచిత ప్రస్థానత్రయం అంశంగా ప్రసంగించారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు దివంగత కొమరగిరి చంద్రకాంతారావు గృహం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని రంగురంగు విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమరగిరి రఘురామారావు, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి చెస్ ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడస్పోర్ట్స్: గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో చదరంగం వేసవి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి ఎస్కే ఖాసీం తెలిపారు. మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీ, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, గొల్లపూడి వన్ సెంటర్‌లో ఈ క్యాంపులు కొనసాగుతాయన్నారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు మాత్రమే శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ కేంద్రాల్లో విడతల వారీగా శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 98495 14138 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు



విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 20, 21 తేదీల్లో కానూరులో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటారు. అండర్–17 విభాగంలో కె.సుప్రీత్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్–7 విభాగంలో గోకుల్‌నందన్ రెడ్డి సిల్వర్, కె.సురార్చిత్ నాల్గవ స్థానాన్ని, అండర్–9 విభాగంలో బి.శ్రీవశిష్ట సిల్వర్, అండర్–11 విభాగంలో ఎ.సుహాస్ సిల్వర్, జె.లాలస బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ పి.రేణుక, చీఫ్ కోచ్ ఎం.ఎం.ఫణికుమార్ అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

రెండో రోజుకు చేరిన మరకత శివలింగ వాయు ప్రతిష్ట



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు లోక కళ్యాణార్థం విశేషంగా హోమాలు నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతుల చేతులమీదుగా పూజలు, అభిషేకం, హోమం జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా నున్న పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గత అయిదు రోజులుగా జరుగుతున్న నున్న గ్రామ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల చివరిరోజు మంగళవారం పేరంటాళ్ల గోపిరెడ్డి–పార్వతమ్మ, చింతయ్య–వీరమ్మ, రామిరెడ్డి–నాగమ్మలకు మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. నున్న గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన పాతపాడు, విలేజి కండ్రిక, పాయకాపురం, సూరంపల్లి, రామచంద్రపాలెం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. నాగమ్మ–రామిరెడ్డి పేరంటాలమ్మ గుడిదగ్గర నుంచి అమ్మవారికి పసుపు బండి బోనాలు సమర్పించారు. తిరునాళ్లల్లో అతి ముఖ్యమైన ఘట్టం గ్రామ పెద్ద గోళ్ల ఢిల్లీ వెంకటేశ్వరరావు ఇంటి నుంచి గొర్రెపొట్టేలును మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేసిన అనంతరం సిడిబండికి కట్టారు. సిడిబండిపై భీమవరపు సుబ్బారెడ్డి ఆసీనులు కాగా గ్రామ పురవీధుల్లో సిడిబండి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఊయల కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్కారెడ్డి నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు తిరునాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోబోటిక్ టెక్నాలజీపై సదస్సు

గన్నవరంరూరల్: రోబోటిక్ టెక్నాలజీలో నూతన ప్రయోగాలపై విద్యార్థులకు నిరంతర అవగాహన అవసరమని ప్రొఫెసర్ కె.ఫణిశ్రీనివాస్ అన్నారు. మాదలవారిగూడెం లింగయ్యాస్ ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. ఇమేజ్ ప్రాసెసింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్‌పై ప్రసంగించారు. హెచ్‌సీఎల్ ప్రతినిధులు, కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎస్.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన




నందిగామ 16వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఈ ఐదేళ్ల పాలనలో ప్రజల మెచ్చేలా నందిగామ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించానని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 16వవార్డు పరిధిలోని బీసీ కాలనీ, జానకిరామయ్య కాలనీ, గ్యాస్ కంపెనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి రానున్న ఎన్నికల్లో సైతం అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు.

బీసీలకు సముచితస్థానం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి వందలాది కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ క్యాస్ట్ అని చెప్పడమే కాకుండా అది నిజం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాలను బీసీలను ఓటుబ్యాంకుగా చూస్తే జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం తన ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణ ప్రజలకు అవసరమైన వసతులు కల్పించటంతోపాటు కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నామని తమ ఐదేళ్ల పాలనలో చేయగలిగినంత మంచి చేశాం తప్ప ఏఒక్కరికి అన్యాయం చేయలేదని గుర్తుచేశారు.

అండగా నిలిచి ఆశీర్వదించండి..

నందిగామ ఎమ్మెల్యేగా ప్రజలకు మంచి చేశానని మనస్ఫూర్తిగా భావిస్తే మరోసారి అండగా నిలిచి తనను ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. ఈ ఐదేళ్లలో తాను ఏది చేసినా ప్రజల పూర్తి సహకారంతో, ప్రజల కోసమే పనిచేశానని వివరించారు. ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వార్డు కన్వీనర్లు తోట అంజారావు, ఓర్సు జ్వాలా, చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వడ్డెల్లి శ్రీను, మందా మరియమ్మ, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైఎస్ ప్రసాద్, మన్నెం దాసు, పాకాలపాటి కిరణ్, వినుకొండ రామారావు, షేక్ ఫాతిమా, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మఒడి.. చదువుల బడి

- పేద పిల్లల విద్యకు ప్రభుత్వం చేయూత
- ఏటా తల్లుల ఖాతాలో నగదు జమ
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో 11,230 మందికి లబ్ధి



పెనుగంచిప్రోలు కెవీఆర్ జెడ్పీ హైస్కూల్

పెనుగంచిప్రోలు: పిల్లలను ఉన్నతంగా చదివించాలి...కాయ కష్టం చేసైనా వారి బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులు కలలు కంటారు. అయితే కార్పొరేట్ విద్య మరీ ఖరీదు కావడంతో వారి కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయి. పేదింటి పిల్లలకు చదువు అందని ద్రాక్షలాగా మిగిలిపోతోంది. పిల్లలను బడికి పంపించలేని తల్లులబాధ వర్ణనాతీతంగా మారింది. ఈ నేపథ్యంలో ఐదేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి అనే పథకాన్ని అమలుచేశారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాల్లో అత్యంత ప్రతిష్మాత్మక పథకం ఈ అమ్మఒడి. ఈపథకం పేద విద్యార్థుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. తమ చిన్నారిని బడికి పంపించే ప్రతి తల్లి బ్యాంకు ఖాతాల్లో ఏడాదికి రూ.15వేలు జమచేస్తున్నారు. అదేవిధంగా విద్యార్థుల విద్యా జీవన విధానాన్ని ఈ పథకం పూర్తిగా మార్చేసింది. ఈ పథకానికి తోడు నాడు–నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పేదింటి బిడ్డకు ఎన్నడూ లేనట్టుగా కార్పొరేట్‌కు తలదన్నేలా ప్రభుత్వ బడుల్లోనే ఐదేళ్లుగా సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతోంది.

తల్లులకు ఆర్థికంగా చేయూత..

కార్పొరేట్ బడుల్లో చదివిస్తే వేలకు వేలు డబ్బులు కట్టాలి. కానీ అమ్మఒడి పథకం కింద ప్రభుత్వ బడుల్లో పిల్లలను చదవించే తల్లుల ఖాతాలోనే డబ్బులు వేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏటా రూ.15వేలు జమచేస్తోంది. అందులో రూ.2వేలు పాఠశాలలో టాయిలెట్స్ శుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలకు ఇస్తున్నారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల కుటుంబాలకు దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం కింద ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు.

పేటలో 11230 మందికి లబ్ధి..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 11,230 మంది విద్యార్థులకు అమ్మఒడి కింద అర్హత సాధించారు. వీరి తల్లుల ఖాతాలో రూ.15వేలు ప్రభుత్వం ఏటా జమ చేస్తోంది. ఈ పథకం కింద సుమారు 14.60కోట్లను ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో చిన్నారుల తల్లుల బ్యాంకు అకౌంట్లలో జమచేసింది. దీంతో వారు వారి పిల్లలను హాయిగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చదివిస్తున్నారు. అమ్మఒడి పథకం కింద ఏటా ఆర్థికసాయం అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బిడ్డల చదువే ఆస్తిగా భావిస్తున్నాం..



మాది మధ్యతరగతి కుటుంబం. ఇద్దరు మగపిల్లలు. పెద్దబ్బాయి గోపాల్ 8, చిన్నబ్బాయి అంక్షిత్ ఐదోతరగతి చదువుతున్నారు. పెద్దబ్బాయికి అమ్మఒడి కింద ఏటా రూ.15వేలు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చదువే పిల్లల చదువే ఆస్తిగా భావించి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. మేము అదే నమ్మాం.

– దండా పుష్పలత, పెనుగంచిప్రోలు

అమ్మఒడి ఆదుకుంటోంది..



మాది పేద కుటుంబం. మాకు స్పందన, క్రాంతి ఇద్దరు ఆడపిల్లలు. మేము కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాం. ఇద్దరు ఆడపిల్లలను చదివించుకుందామంటే పేదరికం అడ్డుగా ఉండేది. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అమ్మ ఒడి పథకం అమలుచేస్తుండటంతో మాకు ఒక నమ్మకం కలిగింది. ఒక అమ్మాయికి అమ్మఒడి డబ్బులు వస్తున్నాయి. ప్రభుత్వమే అన్నీ ఉచితంగా ఇస్తోంది. పిల్లల చదువును అమ్మఒడి ఆదుకుంటోంది.

– గొర్రెపాటి ప్రమీల, కె.పొన్నవరం

ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా..



నాభర్త, నేను కూలీ పనులు చేసి జీవిస్తున్నాం. పెద్దబ్బాయి రాకేష్ 7, చిన్నబ్బాయి నాగచరణ్ నాలుగోతరగతి చదువుతున్నాడు. ఇద్దరు పిల్లల చదువులు భారంగా మారాయి. ఒకరిని చదివించి మరొకరిని ఆపేద్దామని అనుకున్నాం. అమ్మఒడి వస్తుండటంతో ఇద్దరి చదువులు సాగుతున్నాయి. బ్యాంక్ ఖాతాలో పడే అమ్మఒడి సొమ్ములో కొంత డిపాజిట్ కూడా చేస్తున్నాం. పిల్లల చదువుకే అవసరమైతే వాడుతున్నాం.

– గుగులోతు రేణుక, పెనుగంచిప్రోలు

హాయిగా చదివిస్తున్నాం..



గతంలో జూన్ నెల వస్తుందంటే పిల్లల పుస్తకాలు, బట్టలు కోసం వేలు ఖర్చు చేయాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు పిల్లల చదువు కోసం ఎలాంటి కష్టం లేకుండా పోయింది. పిల్లలను చదివించేందుకు ఏడాదికి రూ.15 వేలు అమ్మఒడి ఇస్తుండటంతోపాటు అన్నీ ఉచితంగా అందించి మంచి భోజనం పెడుతున్నారు. చదువు పరంగా ఏఇబ్బంది వచ్చినా అమ్మఒడి ఉపయోగ పడుతోంది.

– షేక్ పర్వీన్, నవాబుపేట

సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

ఇబ్రహీంపట్నం: ఆల్ఫా సూపర్ మార్కెట్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మార్కెట్ ముందు భాగంలోని పిజ్జా కార్నర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కరెంట్ వైర్లు ఇంటర్నల్‌గా కాలిపోయి శ్లాబ్ సీలింగ్‌కు నిప్పు అంటుకుంది. కాలిపోయిన సీలింగ్ ముక్కలు గదిలో పడటం ద్వారా షాపులో ఉన్న ప్లాస్టిక్, తదితర వస్తు సామగ్రి కాలిబూడిదయ్యాయి. భారీగా పొగలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు మూడు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



గంపలగూడెం: గంపలగూడెం షిర్డీ సాయి ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి నందా దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి మహిళలు నందా దీపాలను చేబూని వెంట రాగా మందిరం చుట్టూ 11 ప్రదక్షిణలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

• కళ్యాణం.. కమనీయం




తిరుమలగిరి వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కళ్యాణోత్సవం మంగళవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి వేళ ఆలయం ఎంతో ఆకర్షణీయంగా దర్శనమిచ్చింది. వేలాది మంది భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. – జగ్గయ్యపేట

సిద్ధార్థలో ఇంజినీరింగ్ ప్రవేశాలపై ఉపకార వేతనాలు



ఫలితాలు ప్రకటిస్తున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్,తదితరులు

పెనమలూరు: వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీగా మార్పు చెందిందని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. ఆయన మంగళవారం కాలేజీలో విలేకరులకు వివరాలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం బీటెక్ కోర్సులో ప్రవేశించే వారికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాలు విడుదల చేస్తూ ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ ప్రవేశాలు ప్రారంభించామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన సిద్ధార్థ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌కు(ఎస్ఇఇఇ–24) విశేష స్పందన లభించిందన్నారు. ఎస్ఇఇఇ ర్యాంకులతో పాటు, జేఈఈ మెయిన్స్, ఎంసెట్, ఇంటర్ ఫలితాలు ప్రామాణికంగా తీసుకుని ప్రతిభ చూపిన 500 మంది విద్యార్థులకు 15 శాతం నుంచి 100 శాతం ఉపకార వేతనాలు ఇస్తామని అన్నారు. బీటెక్ ప్రవేశ పరీక్ష ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విఆర్‌సిద్ధార్థ.ఎసి.ఇన్‌లో చూడాలన్నారు. సమావేశంలో కన్వీనర్ మలినేని రాజయ్య, డీన్ బావినేని పాండురంగారావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఏపీ గ్రంథాలయ సంఘ కార్యదర్శి రావి శారద



రావి శారదను సత్కరిస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఏపీ గ్రంథాలయ సంఘ కార్యదర్శి రావి శారద పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, కృష్ణా జిల్లా, విద్యార్థి వికాస వాహిని సంయుక్త ఆధ్వర్యాన రామమోహన గ్రంథాలయంలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రావి శారద మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మేధస్సు వికసిస్తుందన్నారు. పుస్తక విలువను తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భారతదేశ పౌర గ్రంథాలయ అభివృద్ధి ప్రణాళిక కమిటీ సభ్యురాలిగా డాక్టర్ రావి శారద, పుస్తక పఠన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఏఐఆర్ మాజీ డైరెక్టర్ మంజులూరి కృష్ణకుమారిని నిర్వాహకులు సత్కరించారు. విద్యార్థి వికాస వాహిని నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపకులు వేములపల్లి కేశవరావు, అలాగే పుస్తక పఠన ప్రోత్సాహ అవార్డు గ్రహీత మంజులూరి కృష్ణకుమారి, రామమోహన గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, విజయవాడ సెంట్రల్ రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన దీవెన ఫౌండేషన్



బాధితురాలికి చెక్ అందజేస్తున్న ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న యువతికి వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. చిట్టినగర్ కలరా హాస్పిటల్ వద్ద నివసిస్తున్న గౌరీ ప్రియాంక(18) డిగ్రీ చదువుతుంది. తండ్రి మరణించడంతో తల్లి రెక్కల కష్టంపై కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో గౌరీప్రియాంక అనారోగ్యం కారణంగా గత కొన్ని నెలల నుంచి బాధపడుతూ చికిత్స చేయించుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించడంతో మంగళవారం ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు వన్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ గోపరాజు, కానిస్టేబుల్ బాలరాజు బాధితురాలి ఇంటికి వెళ్లి తమ వంతు సాయంగా రూ. 10 వేలు చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్య, వైద్యం సంబంధిత విషయాల్లో ఇబ్బందుల్లో ఉన్న వారికి కులమతాలకు అతీతంగా తమ వంతు సహాయ సహకారాలను అందించడమే దీవెన ఫౌండేషన్ లక్ష్యమని సభ్యులు పేర్కొన్నారు.

సంకల్పానికి శారీరక వైకల్యం అడ్డుకాదు



స్మార్ట్ గ్లాసెస్ అందుకున్న విద్యార్థులతో జయిత, అజయ్‌సింగ్ తదితరులు

గుణదల(విజయవాడతూర్పు): జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే సంకల్పం ఉంటే శారీరక వైకల్యాన్ని అధిగమించి అభివృద్ధి సాధించవచ్చని ఎస్‌బిఐఎఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జయిత నహా అన్నారు. ఆంధ్రా లయోల కళాశాలలో అంధ విద్యార్థులకు స్మార్ట్ గ్లాసెస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. శారీరక వైకల్యం ఉన్నంత మాత్రాన అంధ విద్యార్థులు అధైర్య పడకూడదని తెలిపారు. గతంతో పోల్చితే అంధ విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని అన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా అన్నింటిలో తమ ప్రతిభాపాటవాలు చాటుతున్నారని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో వస్తున్న సాంకేతికత ద్వారా అంధ విద్యార్థులకు కావలసిన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సౌండ్ కంప్యూటర్, బ్రెయిలీ సిస్టమ్స్, స్మార్ట్ గ్లాసెస్ అంధులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అంధ విద్యార్థులను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 10 మంది అంధ విద్యార్థులకు స్మార్ట్ గ్లాసెస్ పంపిణీ చేశారు. లయోల కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి జి.సహాయభాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలో గొల్లపూడి బైపాస్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన జైపూర్ సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌లోని దివంగత గరిమెళ్ల సుబ్బారావు కళావేదికపై కళాకారిణులు ప్రదర్శించిన పలు అంశాలు సందర్శకులను అలరించాయి. నాట్యాచారిణి అనురాధ నేతృత్వంలో ఆమె శిష్యులు 'సాంబశివ అనరే', 'ముద్దుగారే యశోద', 'తాండవ నృత్యకరి', కరగ నృత్యాంశాలకు చక్కని అభియనంతో నర్తించారు. అదే విధంగా జానపద నృత్యాల్లో లంబాడీ, పట్నం ఎల్లొచ్చాడే మావ అనే గీతాలకు డాన్స్ చేశారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు గరిమెళ్ల నానయ్య చౌదరి(నాని) కళాకారిణులకు జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో కళావేదిక ఏర్పాటు చేసి ప్రతి రోజు సాయంత్రం సమయాల్లో ప్రముఖ నాట్యాచార్యుల దర్శకత్వంలో శిక్షణ పొందిన ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయిని అరుణకుమారి సేవలు ప్రశంసనీయం

మైలవరం: వెల్వడం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయిని జి. అరుణకుమారి సేవలు ప్రశంసనీయమని ఎస్టీయూ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ ఎం. బసవయ్య అన్నారు. వెల్వడం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని అరుణకుమారి పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం జరిగింది. నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయినిగా అంకిత భావంతో పనిచేసి, ఎందరో విద్యార్థులను ఉన్నత స్థితికి చేర్చడానికి ఆమె ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. ఎస్టీయూ ఏపీ జిల్లా కార్యదర్శి కె. ప్రభుకుమార్ మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని, మండల ఉత్తమ ఉపాధ్యాయినిగా అరుణకుమారి అవార్డులు అందుకున్నారని అభినందించారు.

టెన్త్ టాపర్ మనస్వికి పలువురి అభినందన

నూజివీడు/ముసునూరు: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 600 మార్కులకు 599 సాధించి రికార్డు సృష్టించిన నూజివీడు పట్టణానికి చెందిన ఆకుల వెంకట నాగసాయి మనస్విని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తనయుడు చంటినాయన సోమవారం రాత్రి అభినందించారు. బాలిక ఇంటికి వెళ్లి ఆమెను సత్కరించి స్వీటు తినిపించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగాలని ఆకాంక్షించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ పాల్గొన్నారు. మనస్విని నూజివీడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గా భవాని, వెంకట్రావు ఘనంగా సత్కరించారు.


మన డాక్టర్ గారి
నామినేషన్ కార్యక్రమాన్ని
విజయవంతం చేయండి
నవరత్నాల సృష్టికర్త, ఇచ్చిన హామీలలో 99% నెరవేర్చి సంక్షేమ పథకాలతో
పేదప్రజలకు అండగా నిలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న
గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి గారి ఆశీస్సులతో
మన ప్రియతమ నాయకులు, నవ నందిగామ నిర్మాణకులు, నిత్యం
నియోజకవర్గ అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తున్న శాసనసభ్యులు
శ్రీ మొండితోక జగన్‌మోహనరావు గారు
వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ది. 24-04-2024న (నేడు)
నామినేషన్ వేయుచున్నసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు,
అభిమానులు భారీగా తరలివచ్చి నామినేషన్ మహోత్సవాన్ని విజయవంతం
చేయగలరని కోరుచున్నాము.
పోలింగ్
VOTE
13 మే 2024
మీ పవిత్రమైన ఓటును
ఫ్యానుగుర్తుపై వేసి
అఖండ మెజారిటీతో
గెలిపించ ప్రార్థన
మన ఎన్నికల గుర్తు
ఫ్యాన్
ఆర్డీఓ ఆఫీస్
గాంధీ సెంటర్
భారత టాకీస్ సెంటర్
మయూరి రోడ్డు
పాత బస్టాండ్
రథం సెంటర్
మెయిన్ బజార్
గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు
CM రోడ్డు
LP సెంటర్
పార్టీ ఆఫీస్
కార్యక్రమం రూట్ మ్యాప్
కోవెలమూడి వెంకట నారాయణ
YSRCP రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , Ex. MPP నందిగామ
శ్రీ మొండితోక జగన్‌మోహనరావు గారు
వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి